క్లుప్తంగా

ఆలయంలో చీరల వేలం నిర్వహణ

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు శనివారం వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా ఆలయానికి రూ. 45,050 ఆదాయం వచ్చినట్లు ఈవో నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వేలం పాటల పర్యవేక్షణాధికారి తేజ, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంకల్ప పత్రాలు అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) సంఘ్ గణవేష్ సప్తాహంలో భాగంగా పట్టణంలో శనివారం స్వయం సేవకులు సంకల్ప పత్రాలను అందజేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సన్నాహ సమాలోచన లక్ష్యాలలో భాగంగా స్వయంసేవకులు పట్టణంలో పర్యటించారు. సంఘ సంకల్ప పత్రాలను హిందూ కుటుంబాలకు అందజేశారు. ఈసందర్భంగా కార్యకర్తలు భారత్ సర్వమానవ సౌభ్రాతృత్వంతో విశ్వగురు స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.

24న విజయవాడలో దళిత రణభేరి

నందిగామరూరల్: దళితులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆపార్టీ ముఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈనెల 24న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన దళిత రణభేరి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు దొండపాటి శామ్యూల్ కుమార్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు యరగొర్ల ఉదయ్‌కిరణ్, దాసరి కృష్ణ, గాలంకి వెంకటేశ్వరరావు, దొన్న కోటేశ్వరరావు, జూపూడి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలు వాయిదా

ఇబ్రహీంపట్నం:కొండపల్లిలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించాల్సిన సీఐటీయు జిల్లా 12వ మహాసభలు అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వివిధ అనుబంధ సంఘాల సమస్యలపై ఆందోళనకు పిలుపు ఇవ్వడంతో ఈ మేరకు వాయిదా నిర్ణయం తీసుకున్నామన్నారు. వచ్చే నెల 12, 13వ తేదీల్లో మహాసభలు నిర్వహిస్తామని వారు వివరించారు.

గ్రామాల్లో జ్వరాల విజృంభన

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు..
- గ్రామాల్లో అధ్వాన పారిశుద్ధ్యం
- అరకొర వైద్యసేవలు
- పట్టించుకోని పాలకులు
- భయాందోళనలో జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు



జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

జగ్గయ్యపేట: నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాకాలం కావడంతోపాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉండి తాగునీరు కలుషితమవుతుండటంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. వైద్యారోగ్య సిబ్బంది కూడా పట్టించుకోకపోతుండటంతో వారంరోజులుగా రోగులు ప్రభుత్వాస్పత్రులకు క్యూ కడుతున్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం..

నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలంతోపాటు పట్టణంలోనూ పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉంది. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో సైడ్‌కాల్వల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అదేవిధంగా తాగునీటి ట్యాంకులను శుభ్రంచేయకపోవడంతో తాగునీరు సైతం కలుషితమవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగ్గయ్యపేట మండలంలోని ధర్మవరప్పాడుతండ, మంగొల్లు, రామచంద్రునిపేట, అన్నవరం, గండ్రాయి, మల్కాపురం, షేర్‌మహ్మద్‌పేట, వేదాద్రి, వత్సవాయి మండలంలోని వత్సవాయి, మంగొల్లు, మక్కపేట, భీమవరం, చిన్నమోదుగపల్లి, పెద్దమోదుగపల్లి, రామచంద్రాపురం, పెనుగంచిప్రోలు మండలంలోని లింగగూడెం, సుబ్బాయిగూడెం, కొల్లికుళ్ల గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది.



తక్కెళ్లపాడు పంచాయతీ కార్యాలయం వద్ద అపరిశుభ్రంగా ఉన్న నీటితొట్టి



తక్కెళ్లపాడులో ఏళ్ల తరబడి పూడిక తీయకుండా వదిలేసిన మురుగుకాల్వ

తాగునీటి ట్యాంకులను సైతం క్లోరినేషన్ చేయించే విషయంలో పంచాయతీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా ఈ జ్వరాల విజృంభనకు కారణమని ప్రజలు చెబుతున్నారు. షేర్‌మహ్మద్‌పేటలో చెరువులోనే తాగునీటి బావి ఉండటంతో చెరువు నీరు బావిలోకి ఇంకి తాగునీరు కలుషితమవుతండగా, సంబంధిత అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడకపోతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జయంతిపురంలో మురుగు కాల్వ పరిస్థితి ఇది

పట్టించుకోని వైద్యారోగ్య శాఖ..

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నా వైద్య సిబ్బంది మాత్రం గ్రామాల్లో తూతూమంత్రంగా సర్వేలు చేపడుతున్నారు. దీంతో ఇంటిలో ఒకరికి జ్వరం వస్తే మిగిలిన వారందరికి జ్వరాలు వస్తున్నాయి. జ్వరం రాగానే వైద్యుల వద్దకు వెళితే టైఫాయిడ్, మలేరియా, డెంగీ అంటూ భయపెడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఆస్పత్రులలో మందులు కూడా అరకొరగానే ఉన్నాయని, రక్త పరీక్షలు కూడా బయట చేయించుకోవమని చెబుతున్నారని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్యూ కడుతున్న రోగులు...



పెనుగంచిప్రోలులో ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటున్న రోగులు

జ్వరాలు, జలుబు, దగ్గులతో బాధపడుతూ నిత్యం వందలాది మంది జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. జ్వరాలతో బాధపడుతూ రెండురోజులుగా 20మంది ఆస్పత్రిలో జాయిన్‌కాగా, పదుల సంఖ్యలో రోగులు అవుట్ పేషంట్లుగా వైద్యం చేయించుకున్నారు. గతేడాది సైతం ఈ ప్రాంతంలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో పరిస్థితి ఎక్కడ అదుపు తప్పుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి జ్వరాల అదుపునకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టైటిల్ ట్రాన్స్‌ఫర్ మేళాకు 54 అర్జీలు



జగ్గయ్యపేటఅర్బన్:జగ్గయ్యపేట పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాలతో రెండు రోజులపాటు నిర్వహించిన టైటిల్ ట్రాన్స్‌ఫర్ మేళాకు 54 అర్జీలు అందినట్లు మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావు శనివారం తెలిపారు. రెవెన్యూ ఆఫీసర్ త్రినాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఈ అర్జీలను స్వీకరించినట్లు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో స్వీకరించిన అర్జీలను రెండువారాల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా-కట్టలేరు



వీరులపాడు:ఎగువన కురుస్తున్న భారీవర్షాల కారణంగా భారీగా వరద వస్తుండటంతో మండలంలోని పల్లంపల్లి సమీపంలోని వైరా-కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. వైరా-కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వైరాకట్టలేరును తహసీల్దార్ రవికుమార్ పరిశీలించి రాకపోకలను నిలుపుదల చేశారు. రాకపోకలు సాగించకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కేసుల పరిష్కారంలో రాజీయే ఉత్తమ మార్గం

- జాతీయ లోక్‌అదాలతో 494 కేసుల పరిష్కారం
- పరిహారం కింద రూ.3.72కోట్లు అందజేత
- జడ్జి పగడాల శ్రీనివాసరావు వెల్లడి



కక్షిదారులకు తీర్పు పత్రాలను అందజేస్తున్న జడ్జి పగడాల శ్రీనివాసరావు

నందిగామరూరల్: కక్షిదారుల తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడమే ఉత్తమమైన మార్గమని 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి, నందిగామ మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ పగడాల శ్రీనివాసరావు సూచించారు. జాతీయ లోక్‌అదాలత్ ముఖ్యఉద్దేశం కూడా అదేనని స్పష్టం చేశారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా మొత్తం 494 కేసులను పరిష్కరించి పరిహారం కింద కక్షిదారులకు రూ. 3.72కోట్లు అందించినట్లు వివరించారు. 16వ అదనపు జిల్లా కోర్టు పరిధిలో 57 కేసులను పరిష్కరించి రూ.2,57,14,837 నష్టపరిహారం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో రెండు కేసులను పరిష్కరించి రూ.13.55 లక్షల పరిహారం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రిన్సిపల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పరిధిలో 195 కేసులను పరిష్కరించి పరిహారం కింద రూ. 6,87,300, అడిషనల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలో 240 కేసులను పరిష్కరించి కక్షిదారులకు రూ. 94,55,250ను పరిహారంగా అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి షేక్ రియాజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. సమైక్య భారతి, ఆంధ్రప్రదేశ్ తెలుగు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం భాషా సదుస్సు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సమన్వయకర్త పి. కన్నయ్య మాట్లాడారు. బోడి ఆంజనేయరాజు, కె. డేవిడ్‌రాజు, స్వాతి, శ్యాం ప్రసాద్ తదితరులు చిత్ర గీతాలను ఆలపించారు.

ట్రాన్స్‌జెండర్ల వేధింపులపై ఫిర్యాదు



జగ్గయ్యపేటఅర్బన్: దసరా మామూళ్ల పేరుతో ట్రాన్స్ జెండర్లు వేధిస్తున్నారంటూ జగ్గయ్యపేటలోని పలువురు బంగారం వ్యాపారులు శనివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు బంగారు వ్యాపారులు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ జి.రాజుకు ఈమేరకు ఫిర్యాదు అందజేశారు. ట్రాన్స్‌జెండర్లు తరచూ తమ షాపులకు వచ్చి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇవ్వకపోతే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కావున ట్రాన్స్ జెండర్ల బారినుంచి తమను కాపాడాలని వ్యాపారులు కోరారు. అనంతరం ఎస్ఐ రాజు స్పందిస్తూ ఈ ఘటనపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సహస్రమోదక గణపతి హోమం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన వేంచేసియున్న శివ పంచాయతన క్షేత్రం మఠం శివాలయంలో శనివారం సహస్ర మోదక గణపతి హోమం, సహస్ర సంఖ్యావల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హోమం నిర్వహించారు. దేవాలయ అర్చకులు ఘట్టి సాయిశర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ హోమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

వేతన చట్ట అమలుకు డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

కంచికచర్ల: కార్మికులందరికీ కనీస వేతనం అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు కార్మికులందరికీ కార్మికుల వేతన చట్ట ప్రకారం వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారని, కాని అధికారంలోకి వచ్చి 15 నెలలైన ఆ హామీని నెరవేర్చడం లేదని మండిపడ్డారు. కార్మికులందరికీ వేతన చట్ట కింద నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాల విధానాలతో నిత్యవసర వస్తువుల ధరలు, విద్యా వైద్యఖర్చులు ఆకాశానంటుతున్నాయని విమర్శించారు. పెరుగుతున్న ధరల కనుగుణంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో పారిశుద్ధ్య కార్మికులు, అంగనవాడీకార్యకర్తలు, ఆశావర్కర్లకు న్యాయం చేస్తామని గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పిస్తామని ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అంటూ ఇచ్చిన ఆయా హామీల సంగతేమిటని ప్రశ్నించారు. కంచికచర్ల భవిత సెంటర్‌లో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న తాళ్లపల్లి శివను అక్రమంగా తొలగించారని, ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను సత్వరమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి సీఐటీయూ నాయకురాలు సీహెచ్ పుల్లమ్మ అధ్యక్షత వహించగా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.కమల, మండల కార్యదర్శి బెజ్జం భూషణం, అంగనవాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.20వేలు ఆర్థిక సాయం



ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నందిగామటౌన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు మాలెంపాటి ప్రసాద్, తొర్లికొండ సీతారామయ్య సౌజన్యంతో పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో అనాసాగరంనకు చెందిన బీటెక్ విద్యార్థి పోలా గోపీ శ్రీనివాస్, పెనుగంచిప్రోలు మండలం తోటచర్లకు చెందిన ఫిజియోథెరపీ విద్యార్థిని పాపట్ల పూజితలకు రూ.20వేల ఆర్థిక సహకారాన్ని శనివారం అందజేశారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండవపు సీతారామయ్య, మారం సత్యనారాయణ, గోపు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, ఆర్ఐ నరసింహారావు, పబ్బతి నరేంద్ర, కడియాల సుబ్బారావు పాల్గొన్నారు.

మూతపడుతున్న నర్సరీలు

- గతేడాది మిర్చికి గిట్టుబాటు ధర లభించకపోవడమే కారణం
- ఈ ఏడాది పడిపోయిన మిర్చి సాగు విస్తీర్ణం
- మిర్చి నారుకు తగ్గిన డిమాండ్
- నర్సరీల విస్తీర్ణం కూడా తగ్గుదల



శివాపురంలో నారు పెంచకుండా వదిలేసిన నర్సరీ

పెనుగంచిప్రోలు: గతేడాది మిర్చి పంటకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది మిర్చిసాగు విస్తీర్ణం భారీగా తగ్గనుండగా, ఆ ప్రభావం నర్సరీలపై పడింది. మిర్చి సాగు విస్తీర్ణం తగ్గనుండటంతో నర్సరీలు కూడా ఒక్కోటి మూతపడుతున్నాయి. నర్సరీల యజమానులు కొందరు విస్తీర్ణం తగ్గిస్తుండగా, కొందరు మిర్చి నారు పెంచకుండానే వదిలేస్తుండటం గమనార్హం.

తగ్గనున్న సాగు విస్తీర్ణం..

జిల్లాలో మిర్చిసాగు గతేడాది సుమారు 33,700 ఎకరాల్లో సాగగా, ఈ ఏడాది సాగు విస్తీర్ణం 25వేల ఎకరాల్లోపే పరిమితమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 8నుంచి 9వేల ఎకరాల్లో మిర్చి మొక్కలు నాటినట్లు అంచనా. జూన్ నెలలో వేసిన మిర్చినారు ఆగస్టు మొదటి వారంలో చేతి కొస్తుంది. దీంతో రైతులు నారు తీసుకెళ్లి పొలాల్లో నాటుతారు. అయితే ఈఏడాది రైతులు మిర్చి కంటే పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసేందుకు మక్కువ చూపిస్తున్నారు. గతేడాది మిర్చి క్వింటా ధర రూ.10 వేల నుంచి రూ.13 వేలకు మించి పలకకపోవడమే ఇందుకు ప్రధానకారణం. దీనికి తోడు తెగుళ్లు, కూలీల ఖర్చు పెరగడంతో సాగు ఖర్చులు కూడా రాక రైతులు ఇబ్బందిపడ్డారు. అంతకుముందు ఏడాది అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మిర్చి క్వింటా రూ.23వేలకుపైగా పలుకగా, గతేడాది సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మిర్చి ధర సగానికి సగం పడిపోవడం గమనార్హం.



ముచ్చింతాల వద్ద మూసివేసిన నర్సరీ

పెట్టుబడులు కూడా దక్కని వైనం..

మిర్చి పంట ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడి అవుతుండగా, గతేడాది మిర్చికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో సాగుఖర్చుల్లో సగం కూడా రాలేదు. దీంతో మిర్చి సాగు రైతులు అప్పులపాలయ్యారు. ఇక కౌలు రైతులు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. దీంతో ఈ ప్రభావం మిర్చి నర్సరీలసాగుపై పడింది.

నష్టాల బాటలో నర్సరీలు..

జిల్లాలో గతేడాది మొత్తం 197 మిర్చి నర్సరీలు ఉండగా ఈ ఏడాది ఆసంఖ్య 180కి తగ్గింది. ఈ 180 నర్సరీల్లోనూ మిర్చి నారు పెంచకుండా వదిలేసినవి షెడ్లు కూడా ఉన్నాయి. సాగు విస్తీర్ణం తగ్గడంతో ఒకప్పుడు సిరులు కురిపించిన మిర్చి నర్సరీలు ఈ ఏడాది నష్టాలు చవిచూస్తున్నట్లు యజమానులు వాపోతున్నారు. సాగుచేసిన నారు అయినా పూర్తిగా అమ్ముడుపోతుందో, లేదోననే ఆందోళన నర్సరీల యజమానులను వెంటాడుతోంది. దీంతో చాలా నర్సరీల్లో రైతులు ఇచ్చిన విత్తనాలనే నర్సరీ యజమానులు పెంచి నారును రైతులకు అందిస్తున్నారు. గతేడాది ఒక్కో మిర్చి మొక్క రూపాయి నుంచి రూ.1.25 పైసలు ధర పలుకగా, ఈఏడాది ఒక్కో మొక్క 50పైసల నుంచి 60పైసలకు మించి అడగని పరిస్థితి నెలకొందని నర్సరీల యజమానులు చెబుతున్నారు. ఈ ఏడాది మిర్చి నారు సాగులో నష్టాలు తప్పేలా లేవని వారు వాపోతున్నారు.

నర్సరీ సాగు తగ్గించాం



గతేడాది ఐదు ఎకరాల నర్సరీలో మిర్చి మొక్కలు పెంచగా, ఈ ఏడాది మూడు ఎకరాలకే పరిమితం చేశాం. గతేడాది మిర్చికి ధర లేకపోవడంతోపాటు పెట్టుబడులు విపరీతంగా పెరగడంతో రైతులు మిర్చి సాగు విస్తీర్ణం తగ్గిస్తున్నారు. దీంతో మిర్చినారుకు డిమాండ్ లేదు.

లగడపాటి సురేష్,
నర్సరీ యజమాని, శివాపురం

నవలా సాహిత్యంలో యద్దనపూడిది స్వర్ణయుగం

విజయవాడ కల్చరల్: నవలా సాహిత్యంలో యద్దనపూడి సులోచనారాణిది స్వర్ణ యుగమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. బొమ్మిడాల బ్రదర్స్ సహకారంతో సాహితీ ప్రచురణలు ఆధ్వర్యంలో విఖ్యాత కాలమిస్ట్ నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన పరిచయ కార్యక్రమం విజయవాడ బుక్ ఫెస్టివల్ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ సులోచనా రాణి ప్రవేశంతో నవలా సాహిత్యం రూపు రేఖలు మారిపోయాయన్నారు. తెలుగు పాఠకులు ఆమె నవలలకు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. సులోచనా రాణి సాహిత్య వివేచన రచయిత నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ సులోచనా రాణి నవలలు రాయడమే కాకుండా తెలుగు సినిమాలకు కథలను అందించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. విమర్శలను సైతం ఆమె స్వీకరించేవారన్నారు. కవి బండ్ల మాధవరావు సభను సమన్వయం చేశారు. రచయిత్రి మందరపు హైమావతి సులోచనా రాణి నవలా సాహిత్యం అంశంగా మాట్లాడారు. సాహితీ ప్రచురణకర్త లక్ష్మి, నగరానికి చెందిన పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

విష వాయువుల విడుదలపై గ్రామస్తులు ఆగ్రహం

జి.కొండూరు:కొండపల్లి ఐడీఏలోని కెమికల్ కంపెనీల నుంచి విష వాయువులను రాత్రి సమయాల్లో విడుదల చేస్తున్నారంటూ పక్కనే ఉన్న కట్టుబడిపాలెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు 30 మంది శుక్రవారం అర్ధరాత్రి ఐడీఏలోని కెమికల్ కంపెనీల వద్దకు చేరుకొని విష వాయువుల విడుదల ఆపేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ కెమికల్ కంపెనీల్లో విడుదలయ్యే రసాయనిక వ్యర్థాలను నిల్వ చేసి రాత్రి సమయాల్లో మండించి ఆవిరిని గాలిలోకి విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విధంగా చేయడం వల్లన గాలి కలుషితమై కట్టుబడిపాలెం గ్రామస్తులు మెదడు, కిడ్నీ వ్యాధులు, ఎలర్జీల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెమికల్ కంపెనీల యాజమాన్యాలకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా విషవాయువుల విడుదలను ఆపడంలేదన్నారు. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు స్పందించి విషవాయువుల విడుదలను అరికట్టకపోతే నిరహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.